నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, గురువారం 21 డిసెంబర్ 2023 | KHAMMAM

జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో రాణించాలి

క్రీడాకారిణి హన్సినికి మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి అభినందన

హన్సినిని అభినందిస్తున్న లక్ష్మీబాయి

ఖమ్మం సిటీ, డిసెంబర్ 20: జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో రాణించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి ఆకాంక్షించారు. ఖమ్మం ఏఎంసీ సందర్శనకు ఇటీవల వచ్చిన ఆమె.. రైతుబజార్‌ను సందర్శిస్తున్న క్రమంలో అదే రైతుబజార్ ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్న జీడీ ఉపేందర్ ఆమెకు తన కుమార్తె హన్సినిని పరిచయం చేశారు. తన కుమార్తె జాతీయస్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. దీంతో సదరు క్రీడాకారిణిని డైరెక్టర్ లక్ష్మీబాయి ప్రత్యేకంగా అభినందించారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడాకారిణి హన్సినికి మార్కెటింగ్ శాఖ అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు అలీమ్, మల్లేశం, కిరణ్, నరేశ్, వజీర్, ఆంజనేయులు అభినందనలు తెలిపారు.

అడ్రస్ లేని మిల్లెట్ ఫుడ్

- ప్రచార ఆర్భాటంగానే కేంద్ర ప్రభుత్వ పథకం 'యాస్పిరేషన్'
- భద్రాద్రి ఏజెన్సీ పిల్లల్లో పోషకాహార లోపాన్ని పారద్రోలుతామంటూ గొప్పలు
- ప్రారంభించిన తొమ్మిది నెలలకే పథకాన్ని అటకెక్కించిన కేంద్రం
- బీఆర్ఎస్ ప్రభుత్వంలో రంచనుగా లబ్ధిదారులకు పోషకాహారం
- కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇక ఎలాంటి సేవలు అందుతాయో వేచి చూడాల్సిందే..

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఏజెన్సీ పిల్లల్లో పోషకాహార లోపాన్ని పారద్రోలుతామని గొప్పలు చెప్పుకుంటూ కేంద్రం నీతిఆయోగ్‌లో భాగంగా ప్రవేశపెట్టిన ఆకాంక్ష (యాస్పిరేషన్) ప్రోగ్రాం మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. కేంద్రం ఎంపిక చేసిన యాస్పిరేషన్ జిల్లాలతో పాటు భద్రాద్రి జిల్లా చిన్నారులకూ మొండిచేయే ఎదురైంది. మారుమూల ఏజెన్సీలో కొండరెడ్లు, ఆదివాసీల పిల్లల ఆరోగ్యంపై తాము ప్రత్యేక శ్రద్ధ చూపుతామమని, వారికి మిల్లెట్ ఫుడ్ అందిస్తామని కేంద్ర సర్కారు గొప్పలు చెప్పుకొని ఇప్పుడు చేతులెత్తేసింది. పట్టుమని ఏడాదైనా అమలు చేయకుండా కేవలం తొమ్మిది నెలలకే పథకాన్ని అటకెక్కించింది. పథకం ఆగిపోయి ఇప్పటికీ కొన్ని నెలలు కావొస్తున్నది.

కేంద్ర ప్రభుత్వానికి 'ఆకాంక్ష' లేదు.. అంతా మోసం

అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న పిల్లలు

కేంద్రం పంపిన మిల్లెట్ ఫుడ్డూ లేదు.. దాని అడ్రస్సూ లేదు..

గర్భిణిలకు గుడ్లు,పాలు.పంపిణీ చేస్తున్న డీడబ్ల్యూవో విజేత

రక్తహీనత తక్కువగా ఉన్న గిరిజన ప్రాంతాల్లో చిన్నారులకు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మిల్లెట్ ఫుడ్ అందించాలని కేంద్రం భావించింది. ఇందుకోసం పాల్వంచ, దమ్మపేట ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ముందుగా 100 కేంద్రాలను ఎంపిక చేసింది. 2021 నుంచి పోషకాహారం అందించడాన్ని ప్రారంభించింది. ఆహారంలో ప్రధానంగా రాగి, జొన్న వంటివి ఉండేలా మెనూ అమలు చేసింది. తర్వాత ఆరు నెలలకు ప్రోగ్రాం అటకెక్కింది. 2022లో మళ్లీ ఇదే కార్యక్రమం మళ్లీ షురూ అయింది. ఈసారి కేంద్రం జిల్లాలోని మరో ఆరు ప్రాజెక్టులను అదనంగా ఎంపిక చేసి ప్రోగ్రాన్ని ప్రారంభించింది. తర్వాత మూడు నెలలే ప్రోగ్రాం అమలైంది. తర్వాత గతంలో లాగానే అటకెక్కింది. దీంతో ప్రోగ్రాం కేంద్రం ప్రచార ఆర్భాటం కోసమేననే విషయం తేలిపోయింది.

'ఆరోగ్యలక్ష్మి'నే ఆదుకున్నది..

కేంద్ర ప్రభుత్వం మిల్లెట్ ఫుడ్‌ను నిలిపివేయడంతో గత కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన 'ఆరోగ్యలక్ష్మి' పథకమే గర్భిణులు, బాలింతలు, పిల్లలను ఆదుకున్నది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు పాలు, గుడ్లు, ఆరోగ్యలక్ష్మి భోజనం, బాలామృతం, కిశోరామృతం వంటివి అందాయి. జిల్లాలో 8 నెలల నుంచి ఏడాది వయసున్న చిన్నారులు 8,549 మంది, 1 - 3 వయసున్న పిల్లలు 24,466 మంది, 3 - 6 ఏళ్ల లోపు వయసున్న పిల్లలు 26,749 మంది, గర్భిణులు 8,060, బాలింతలు 6,927 మంది ఉన్నారు. వీరందికీ బీఆర్ఎస్ ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందించింది. ఇక కాంగ్రెస్ పార్టీ ఇటీవల రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. ఆ ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఎలాంటి సేవలను ఎంత సమర్థతతో అందిస్తుందో వేచిచూడాల్సిందే.

మిల్లెట్ ఆహారం ఇవ్వడం లేదు..

ఏజెన్సీలో బలంగా లేని పిల్లలకు కేంద్రం నుంచి అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా కొన్ని నెలలపాటు మిల్లెట్ ఆహారం అందింది. ఆ తర్వాత పథకం ఆగిపోయింది. తర్వాత ఇక్కడి ప్రభుత్వం అం పోషకాహారమే తీసుకుంటున్నాం. ఆరోగ్యలక్ష్మి భోజనంతోపాటు పాలు, గుడ్ల వంటి బలవర్ధకమైన ఆహారం అందిస్తున్నారు. మొదటి తొమ్మిది నెలలపాటు క్రమం తప్పకుండా అందించే పోషకాహారమే తల్లీబిడ్డలకు ఎంతో ఉపయోగం.

- ఆది కావ్య, బాలింత, అశ్వారావుపేట, భద్రాద్రి జిల్లా

అంగన్‌వాడీల్లోనే వైద్యం, ఆరోగ్యం..

అంగన్‌వాడీ కేంద్రాలను మాకు పోషకాహారం అందుతున్నది. గర్భిణులతో పాటు తల్లీబిడ్డలకు ఆరోగ్యపరంగా సూచనలు అందుతున్నాయి. మాకు గుర్తు ఉన్నా లేకున్నా అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు వచ్చి మా పిల్లలకు టీకాలు వేస్తున్నారు. తల్లులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పిల్లలకు అందే మిల్లెట్ ఫుడ్ ఇప్పుడు అందడం లేదు.

- కల్లూరి వసంతలక్ష్మి, గర్భిణి, అశ్వారావుపేట, భద్రాద్రి జిల్లా

బలరామ రూపా.. మము బ్రోవ రావా!

- భద్రాచలంలో కొనసాగుతున్న ముక్కోటి ఏకాదశి వైకుంఠ అధ్యయనోత్సవాలు
- బలరాముడిగా దర్శనమిచ్చిన రామయ్య
- నేడు కృష్ణావతారంలో దర్శన భాగ్యం

బలరాముడిగా దర్శనమిస్తున్న భద్రాద్రి రాముడు

భద్రాచలం, డిసెంబర్ 20: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ సన్నిధిలో వైభవంగా ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాయమ్య బలరామ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతసేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య బలిహరణం, నిత్య హోమాలు, నిత్య హోమాలు చేపట్టారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా తిరుప్పావై పాశురాలను పఠించారు. అనంతరం ఉత్సవమూర్తులను, నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొని వచ్చి అభిషేక తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారికి రాజభోగం సమర్పించారు. అనంతరం పట్టణంలోని తాతగుడి సెంటర్ వరకు తిరువీధి సేవ చేపట్టారు. బలరామ రూపంలో దర్శనమిచ్చిన శ్రీరామచంద్రమూర్తిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఏర్పాట్లను ఆలయ ఈవో ఎల్.రమాదేవి పర్యవేక్షించారు.

నేడు కృష్ణావతారంలో దర్శనం

భద్రాద్రి రాముడు గురువారం శ్రీకృష్ణావతారంలో దర్శనమివ్వనున్నారు. దీంతో పగల్ పత్తు ఉత్సవాలు, స్వామివారి అవతారాలు ముగిస్తాయి. ఆలయ అధికారులు, అర్చకులు శుక్రవారం గోదావరి తీరంలో స్వామివారికి హంస వాహనంపై తెప్పోత్సవం నిర్వహించనున్నారు. శనివారం తెల్లవారుజామున స్వామివారు ఉత్తర ద్వార దర్శనంలో భక్తులకు దర్శనమిస్తారు. వేడుకలను కలెక్టర్ ప్రియాంక అల, ఎస్పీ వినీత్ గంగన్న నేతృత్వంలో ఆలయ ఈవో ఎల్.రమాదేవి, సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుకలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ హాజరు కానున్నారు.

పర్ణశాలలోనూ ఉత్సవాలు..

పర్ణశాల, డిసెంబర్ 20: భద్రాద్రి రామాలయానికి అనుబంధ ఆలయమైన పర్ణశాలలోనూ ముక్కోటి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఎనిమిదో రోజు బుధవారం స్వామివారు బలరాముడి అవతారంలో దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో కళాకారులు నిర్వహించిన హరికథా గానం, వయోలిన్ విభావరి, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఏర్పాట్లను అర్చకులు శేషకిరణ్‌కుమార్‌చార్యులు, రాజగోపాలాచార్యులు, ఏఈవో శ్రావణ్ కుమార్, అనిల్, సూపరింటెండెంట్ కిషోర్ పర్యవేక్షించారు. శుక్ర, శనివారాల్లో జరిగే తెప్పోత్సవం, స్వామివారి ఉత్తర ద్వార దర్శనానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు ఉంటాయి.

వివరాలు తెలుసుకునేందుకు క్యూఆర్ కోడ్

భద్రాచలం సీతారామచంద్ర స్వామి ఆలయ ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్సవాల నిర్వహణ, ట్రాఫిక్ రూట్స్, పార్కింగ్ స్థలాలు, లడ్డూ ప్రసాదం, స్టాల్స్, వైకుంఠ ద్వార దర్శనం, సెక్టార్ల ప్లాన్స్ తెలుసుకునేందుకు పోలీస్‌శాఖ భక్తుల సౌకర్యార్థం క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశారు. కోడ్‌ను స్కాన్ చేసి అన్ని వివరాలు తెలుసుకోవచ్చు. లేదా https://mukkoti.netlify.app/ అనే లింక్‌పై క్లిక్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు.

పర్ణశాలలో తెప్పోత్సవానికి సిద్ధమైన వాహనం

కోవిడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

కొవిడ్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. కొవిడ్ ముందస్తు నియంత్రణ చర్యలపై వైద్య, ఆర్యోగ శాఖ అధికారులతో ఐడీవోసీలో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలో కొవిడ్ వ్యాపి చెందకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో మే నెల నుంచి కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదు కాలేదన్నారు. లక్షణాలు ఉన్న వారందరికీ కొవిడ్ పరీక్షలు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, ఇతర అధికారులు మాలతి, వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్, సైదులు, సదానందం, రమాదేవి, సందీప్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఐడీవోసీలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగినుల సౌకర్యార్థం అక్కడ ఏర్పాటు చేసిన పిల్లల సంరక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. ఐడీవోసీలోని పిల్లల సంరక్షణ కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చిన్న పిల్లలున్న మహిళా ఉద్యోగులు తమ పిల్లలను ఈ కేంద్రంలో అప్పగించి నిశ్చింతగా తమ విధులు నిర్వర్తించుకోవచ్చునని అన్నారు.

విజయ డెయిరీ అసిస్టెంట్ మేనేజర్ సస్పెన్షన్

రఘునాథపాలెం, డిసెంబర్ 20: ఖమ్మం విజయ డెయిరీ పరిధిలోని కొత్తగూడెం పాల శీతలీకరణ కేంద్రం ఇన్‌చార్జి అసిస్టెంట్ మేనేజర్ పీ.అనితాకుమారి సస్పెండ్ చేస్తూ డీడీ ఏ.కుమారస్వామి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చారిజ అసిస్టెంట్ మేనేజర్‌గా ఉన్న అనితకుమారి కొన్నేళ్లుగా తన బంధువులతో పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేయించి బినామీ అకౌంట్లలోకి డెయిరీకి చెందిన నగదును బదిలీ చేయించింది. ఈ మేరకు డీడీ కుమారస్వామి విచారణ చేపట్టడంతో నగదు బదిలీ విషయం తేటతెల్లమైంది. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమెను సస్పెండ్ చేసినట్లు డీడీ తెలిపారు.

రేపు ఖమ్మంలో యువజనోత్సవాలు: డీవైఎస్‌వో

సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి

ఖమ్మం సిటీ, డిసెంబర్ 20: ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ఈ నెల 22న నిర్వహించే యువజనోత్సవాలను జయప్రదం చేయాలని జిల్లా యువజన, క్రీడల అధికారి (డీవైఎస్‌వో)సునీల్‌రెడ్డి కోరారు. నగరంలోని పటేల్ స్టేడియంలో యువజన సంఘాల ప్రతినిధులతో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్కృతిని ప్రతిబింబించే విధంగా పోటీలు ఉంటాయని, ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి ఉత్సవాలకు పంపిస్తామని అన్నారు. అధికారులు, సంఘాల నాయకులు హరిబాబు, జక్కుల వెంకటరమణ, పగడాల కల్యాణి, ఇరిగి ఉజ్వల, తాటిపల్లి సుధీర్, లావణ్య, పగిడిమర్రి భాస్కర్, ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

లో వోల్టేజీతో మరమ్మతులకు గురైన మోటర్లు

బోనకల్లు, డిసెంబర్ 20: నాలుగు రోజులుగా మండలంలో విద్యుత్ సరఫరాలో లోవోల్టేజీ కారణంగా మోటర్లు మరమ్మతులకు గురవుతున్నాయి. మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన రైతులు కొమ్మినేని ఉపేందర్, ఎర్రగాని పరశురాం, పెంట్యాల శ్రీనివాసరావు, పర్సగాని మల్సూరుకు చెందిన మోటర్ పంపుసెట్లు కాలిపోయాయి, విషయాన్ని స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందారు. పంట చేతికొచ్చే దశలో లోవోల్టేజీ సమస్య అధిగమించి రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని రైతులు కోరుతున్నారు.

పార్లమెంటు ఎన్నికల కోసం.. ఓటరు జాబితా సిద్ధం చేయాలి

- నిర్ణీత గడువులోగా దరఖాస్తులను పరిష్కరించాలి
- వీసీలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్

కోవిడ్ పట్ల అప్రమత్తత పై అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ వి.పి గౌతమ్

మామిళ్లగూడెం, డిసెంబర్ 20: రానున్న పార్లమెంట్ ఎన్నికల కోసం ఓటరు జాబితా తయారు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఆదేశించారు. అలాగే, ఎన్నికలను పకడ్బందీ నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేయాలని సూచించారు. పార్లమెంటు ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో హైదరాబాద్ నుంచి బుధవారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఫొటో ఎలక్టోరల్ రోల్‌కు సంబంధించి పెండింగ్ దరఖాస్తులన్నీ పరిష్కరించాలని, ఓటర్ల జాబితాను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖమ్మం నుంచి కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ.. ఎస్ఎస్ఆర్ ప్రక్రియ సమయంలోగా పూర్తి చేస్తామని, సంబంధిత దరఖాస్తులను పెండింగ్ లేకుండా పరిష్కరిస్తామని తెలిపారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఇతర అధికారులు గణేశ్, అశోక్ చక్రవర్తి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో వేగం పెంచాలి

సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ముదిగొండ, డిసెంబర్ 20: ధాన్యం సేకరణలో వేగం పెంచాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని మేడేపల్లిలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఇప్పటి వరకూ సేకరించిన ధాన్యం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా కేంద్రానికి వచ్చిన పంటను వచ్చినట్లు కాటా వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో రాధ, ఎంపీవో సూర్యనారయణ, ఐకేపీ ఏపీఎం చిన్న వెంకటేశ్వర్లు, సర్పంచ్ సామినేని రమేశ్, ఆర్ఐ వహీదా, పంచాయతీ కార్యదర్శి అలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్రం

- ఎంపీలను సస్పెండ్ చేయడం తగదు
- 22న దేశవ్యాప్త నిరసన

వైరాటౌన్, డిసెంబర్ 20 : పార్లమెంటు భద్రతపై చర్చ జరగాలని పట్టుబడిన ఎంపీలను సస్పెండ్ చేయడం సరైంది కాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం అన్నారు. బుధవారం ఇక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష ఎంపీల హక్కులను కాలరాస్తూ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఇప్పటికే141 మంది ఎంపీలపై సస్పెన్షన్ విధించిందని, ఈ చర్య అప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టుఅని అభివర్ణించారు. ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష పార్టీల పిలుపులో భాగంగా ఈ నెల 22న దేశవ్యాప్తంగా జరుగు నిరసన కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

సెమీక్రిస్మస్ వేడుకలు

వైరారూరల్, డిసెంబర్20 : వైరా మండలం గొల్లపూడి గ్రామంలో ఉన్న వృద్ధాశ్రమంలో వార్షికోత్సవ, సెమీక్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్‌యుఐ నియోజకవర్గ అధ్యక్షుడు గరిడేపల్లి కిశోర్, కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు సయ్యద్ అన్వర్‌పాషా, షేక్ అంజద్, బొల్లం గోపిచంద్, షేక్ అభి, బత్తుల సాయిగణేశ్, వీరంశెట్టి వాసుదేవ, వడ్లమూని నిఖిల్, విజయ్, తోట ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.25 వేలు ఆర్థిక సాయం

మధిరరూరల్, డిసెంబర్ 20: మండలంలోని నిధానపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పాఠశాలలో పనిచేస్తూ మృతిచెందిన వేమూరి నాగమణి జ్ఞాపకార్థం లండన్‌లో నివాసిస్తున్న వారి కుమార్తె కుమ్మెట హిమబిందు, చంద్రశేఖర్ దంపతులు రూ.25 వేలు అందజేశారు. బుధవారం పాఠశాలలో తాగునీటి శుద్ధి యంత్రాన్ని ప్రారంభించారు. ఇన్‌చార్జి హెచ్ఎం మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు రంగారావు, పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల సంఘం పాలేరు డివిజన్ కార్యదర్శిగా శ్రీనివాస్

తిరుమలాయపాలెం, డిసెంబర్ 20: ప్రైవేట్ పాఠశాలల సంఘం పాలేరు డివిజన్ కార్యదర్శిగా దమ్మాయిగూడెం శ్రీసరస్వతి విద్యాలయం కరస్పాండెంట్ బానోత్ శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఖమ్మంలో బుధవారం జరిగిన డివిజన్ స్థాయి సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పిండిప్రోలు గౌతమి స్కూల్‌కు చెందిన ఉడుగు ఉపేందర్ ఎన్నికయ్యారు.

డిసెంబర్ 31న కళాకారుల వనసమారాధన

మాట్లాడుతున్న రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్

మధిర, డిసెంబర్ 20: మండలంలోని మాటూరుపేట సీతారామాంజనేయ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 31న ఉదయం 10 గంటలకు మధిర మండలం ఆత్కూరులోని రామకృష్ణ మామిడితోటలో ఉమ్మడి ఖమ్మం జిలా స్థాయి కళాకారుల వనసమారాధన ఏర్పాటు చేసినట్లు రంగ స్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు, సీతారామాంజనేయ కళాపరిషత్ అధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్ తెలిపారు. బుధవారం పట్టణంలోని బంజారాకాలనీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీతారామాంజనేయ కళాపరిషత్ ఆధ్వర్యంలో కళాకారులకు వన సమారాధన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గడ్డం సుబ్బారావు, గడ్డం శ్రీనివాసరావు, టీవీ.రెడ్డి, కళ్యాణపు పుల్లారావు, కురిచేటి సత్యనారాయణ, మేడా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్టార్టప్స్‌కు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలు ఏంటి?

లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని లిఖిత పూర్వకంగా ప్రశ్నించిన ఎంపీ నామా నాగేశ్వరరావు

ఖమ్మం, డిసెంబర్ 20: దేశవ్యాప్తంగా ఔత్సాహికులు ప్రారంభించిన స్టార్టప్స్‌కు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలు ఏంటి? వాటిలో ఎన్నో స్టార్టప్స్ సరిగా నిలదొక్కుకోలేకపోతున్నాయనేది వాస్తవమేనా? ఒకవేళ అది నిజమైతే స్టార్టప్స్‌ను ఆదుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే వివరాలను రాష్ట్రాల వారీగా, యూనియన్ టెరిటరీల వారీగా బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఎంపీ నామా నాగేశ్వరరావు బుధవారం పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని లిఖిత పూర్వకంగా ప్రశ్నించారు. దీనిపై కేంద్ర వాణిజ్యం, పరిశ్రమలశాఖ మంత్రి సోమ్ పర్కాష్ సమాధానమిచ్చారు. 2016 జనవరి 16ను స్టార్టప్ ఇండియాను ప్రారంభించామన్నారు. 2016లో 300కి పైగా ఉన్న స్టార్టప్స్ నేడు 1,14,902కి చేరుకున్నాయన్నారు. వీటిలో గుర్తింపు సాధించిన స్టార్టప్స్ 26,360 ఉన్నాయన్నారు. 2018లో తెలంగాణ గుర్తింపు పొందిన స్టార్టప్స్ 446 ఉంటే, ఇప్పుడు వాటి సంఖ్య 1,792 వరకు చేరందన్నారు. స్టార్టప్స్ అత్యధికంగా మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, గుజరాత్, తమిళనాడులో ఉన్నాయన్నారు. స్టార్టప్స్‌ను ఎస్ఐఎస్ఎఫ్ఎస్, ఎఫ్ఎఫ్ఎస్, సీజీఎస్ఎస్ తదితర పథకాల ద్వారా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అందుకు జాతీయస్థాయిలో ఒక సలహా మండలినీ ఏర్పాటు చేశామన్నారు. పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తున్నామన్నారు.

ఆర్టీసీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి: డాక్టర్ గిరిసింహారావు

కరోనా పట్ల అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గిరిసింహారావు

ఖమ్మం సిటీ, డిసెంబర్ 20: జేఎన్-1 కరోనా వేరియంట్ కారణంగా పలు రాష్ట్రాల్లో కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో నిత్యం విధి నిర్వహణలో భాగంగా ప్రజా సమూహంలో ఉండే ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గిరిసింహారావు సూచించారు. ఖమ్మం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో డ్రైవర్లకు, కండక్టర్లకు బుధవారం అవగాహన కల్పించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళల రద్దీతోపాటు, పండుల వేళ ప్రయాణికుల రద్దీ పెరుగుతున్నందున డ్రైవర్లు, కండక్టర్లు మాస్కులు ధరించాలని, ఇతర జాగ్రత్తలు పాటించాలని సూచించారు. లక్షణాలు కనిపిస్తే తక్షణమే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. డిపో మేనేజర్ శ్రీనివాస్, సీఐ రామయ్య, డీఎస్ రావు, అనిత పాల్గొన్నారు.